క్లుప్తంగా

నీటి సమస్య పరిష్కారం


కుళాయిలను ప్రారంభిస్తున్న దృశ్యం

కోసిగి: మండలంలోని ఐరన్‌గల్లు గ్రామంలో నెలకొన్న నీటి సమస్యకు పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో రెండు కాలనీల్లో నూతన పైప్‌లైన్ వేసి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఆదివారం కుళాయిలకు నీటిని సరఫరా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామంలో వీరబ్రహేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం సర్పంచ్ రామాంజనేయులు ఆధ్వర్యంలో కుళాయిలను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు భీమసేనా, శ్రీరాములు, డీలర్ వెంకటేష్, సంజీవరెడ్డి, చిన్న వీరేష్, పెద్ద ఈరన్న, రంగయ్య, సురేంద్ర గోపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

ఆదోని అర్బన్ : పదో తరగతి ఫలితాలు వెలువడిన వెంటనే స్థానిక ఎస్కేడీ కాలనీలోనున్న ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఇంటర్‌మీడియెట్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సంజన్న ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి గ్రూపులో 88 సీట్లు ఉన్నాయని, తమ కళాశాలలో 13 మంది అనుభవం గల అధ్యాపకులు ఉన్నారన్నారు. ఉచిత బోధన, ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, గ్రంథాలయం సౌకర్యం, సైన్స్ గ్రూపులకు ప్రత్యేక ప్రయోగశాలలు ఉన్నాయన్నారు. వివరాలకు సెల్ 9441156598, 9966766229 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

రక్తదానం ఎంతో గొప్పది


30వ సారి రక్తదానం చేస్తున్న మస్తాన్

ఆదోని అర్బన్: పట్టణంలోని విక్టోరియాపేటలో వెలిసిన సీఎస్ఐ క్రైస్ట్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో దాదాపు 40 మంది రక్తదానం చేశారు. పట్టణానికి చెందిన మస్తాన్ అనే యువకుడు 31వ సారి రక్తదానం చేశాడు. చర్చి పాస్టర్ సంజయ్ మాట్లాడుతూ రక్తదానం గొప్పదని, రక్తం ఇవ్వడం వల్ల ప్రాణదాతలు అవుతారని చెప్పారు. చర్చి కమిటీ కార్యదర్శి సునీల్‌రాజ్, ట్రెజరర్ శ్రీకాంత్, సభ్యులు ప్రసాద్, రాజు, జాన్ పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

కౌతాళం: సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు విద్యార్థుల కోసం ఈనెల 1 నుంచి తరగతులు ఏర్పాటు చేస్తున్నామని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయిన వారి కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ప్రతి రోజు క్లాసులకు రావాలని కోరారు.24వ తేదీ వరకు తరగతులు ఉంటాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం


బాధితుడికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : అకాల వర్షానికి గుడిసె కోల్పోయిన బాధితుడికి ఎమ్మెల్యే ఆదివారం ఆర్థిక సాయం చేశారు. తక్షణ సాయంగా రూ.15వేలు అందజేశారు. అలాగే పక్కా ఇల్లు కట్టించేలా చూస్తామని హామీనిచ్చారు. మండలంలోని దొడ్డనగేరి చెందిన ఆవుల లేపన్న వర్షానికి ఉన్న గుడిసె కూలిపోయిందనే విషయం తెలుసుకొని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, చంద్రకాంత్‌రెడ్డి రూ.10 వేలు, ఎమ్మెల్యే రూ.5 వేలు అందజేశారు.

జయప్రదం చేయండి

పెద్దకడబూరు : బీఎస్పీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంచాల లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధానకార్యదర్శి ఎర్రన్న, ఉపాధ్యక్షుడు సామేల్ పిలుపునిచ్చారు. ఆదివారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మండల కేంద్రంతో పాటు మేకడోణ, జాలవాడి, హెచ్.మురవణి, చిన్నకడబూరు, బసలదొడ్డి, చిన్నతుంబళం గ్రామాల్లో విడుదల చేశారు. వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల భరోసా సభను హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ముఖ్య అతిథిగా హాజరవుతారని, ప్రజలు తరలిరావాలని కోరారు. నాయకులు యువరాజు, కిరణ్‌కుమార్, అయ్యప్ప, లక్ష్మన్న, యాకోబు పాల్గొన్నారు.

బక్క చిక్కిపోతున్నారు..



మాత్ర వేసుకుంటున్న ఈమె పేరు మమత. ఆదోని పట్టణంలోని పింజరి గేరిలో నివాసముంటుంది. ప్రస్తుతం గర్భిణి. రెగ్యులర్ చెకప్‌లో భాగంగా వైద్యుల వద్దకు వెళ్లగా రక్తహీనత ఉందని చెప్పారు. వెంటనే మాత్రలు అందజేశారు. చాలా రోజుల పాటు రక్తహీనతతో ఇబ్బంది పడ్డా. ప్రస్తుతం వారి సూచనల మేరకు మాత్రలు వాడుతున్నా. తమ కాలనీలోని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పర్యవేక్షిస్తున్నారు.

కాన్పు సమయంలో ఇబ్బంది పడ్డా



ఈమె పేరు అనూష. పట్టణంలోని రాంజల రోడ్డులో నివాసముంటున్నారు. రక్తహీనత వల్ల కాన్పు సమయంలో చాలా ఇబ్బందులు పడ్డారు. తప్పనిసరిగా రక్తం కావాలని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు అష్టకష్టాలు పడి రక్తం అందజేసిన తరువాతే వైద్యులు కాన్పు చేశారు. ఈ వ్యాధి ప్రసవ సమయంలో చాలా ఇబ్బందులకు గురిచేస్తుంది. గర్భిణులు ముందుగానే జాగ్రత్తలు పాటించాలని చెబుతోంది. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నామంటోంది.


పింజారిగేరిలో రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు (ఫైల్)

- ఆదోని ప్రాంతంలో అధికమవుతున్న రక్తహీనత కేసులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది
- పోషకారం లోపమే వ్యాధికి కారణం

ఆదోని టౌన్ : జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో రక్తహీనత కేసులు తీవ్రమవుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని, ఇందుకు పౌష్టికాహార లోపమేనని తేల్చి చెబుతున్నారు. ఆదోని ప్రాంతంలో కేసులు అధికంగా నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఆదోని డివిజన్ అభివృద్ధి దూరంగా ఉండటం, కరువు కారణంగా ఏటా 70 నుంచి 80 శాతం మేర వర్షాధారంగా వ్యవసాయం సాగుతుంది. డివిజన్‌లో దాదాపు 15 లక్షల జనాభా ఉంది. నిరక్షరాస్యత, మూఢాచారాలతో రాష్ట్రంలోనే అత్యధిక వెనకబడిన ప్రాంతంగా పేరుగాంచింది. నిరక్షరాస్యత కారణంగా మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడం లేదు. ప్రాణాంతక జబ్బులతో బాధపడుతూ జీవితాన్ని చేతులారా నాశనం చేసుకుంటున్నారు. ఆదోని ప్రాంతంలో మహిళలు, బాలింతలు, చిన్నారులు 50 శాతానికి పైగానే రక్తహీనతతో బాధపడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. సమయానికి ఆహారం తీసుకోకపోవడం, పౌష్టికాహారాన్ని భుజించకపోవడం వల్లే రక్తహీనత కారణమవుతున్నాయని వైద్యవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నా ఫలితం లేకుండా పోతుంది. కేసులు పెరుగుతున్నాయే తప్పా తగ్గడం లేదు. ఐరన్ లోపం అధికంగా ఉండడం, వైద్యుల సలహాలు, సూచనలు పాటించకపోవడం వల్ల ఈ జబ్బుతో బాధపడాల్సి వస్తోంది. రక్తహీనత అంటే రక్తంలో ఇనుము లేకపోవడం, ఇనుము అంటే శక్తి, రక్తహీనత శరీరంలో శక్తి లోపానికి దారితీస్తుంది. ఆదోని పట్టణంలో 207 మంది గర్భిణులు, బాలింతలు 221 ఉన్నారు. రూరల్‌లో గర్భిణులు 317, బాలింతలు 331 ఉన్నారు. ఆదోని రూరల్‌లో మొత్తం గర్భిణుల సంఖ్య 1,407 మంది ఉండగా వీరిలో 313 మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. బాలింతలు 1,372 మంది ఉండగా 331 మంది వ్యాధితో సతమతవుతున్నారు.

రక్తహీనత లక్షణాలు..

అలసట, చికాకు, ఆకలి మందగించడం, కళ్లు తిరగడం, అరచేతుల్లో చెమట రావడం, చిన్నారుల్లో చదువులో అశ్రద్ధ, ఆటల్లో అనాసక్తి, నీరసంగా ఉంటారు. రక్తహీనత ఎక్కువగా ఉండే మహిళలు, బాలింతలు 15–40 వయస్సు గల వారే ఎక్కువ. 11 యేళ్లలోపు పిల్లలోనూ వ్యాధి కనిపిస్తుంది. మగవారిలోనూ కూడా ఈ జబ్బు ఉంది.

- గర్భిణిల్లో రక్తహీనత ఉంటే పిల్లలు తక్కువ బరువుతో జన్మించడం, వారికి ప్రాణహాని చోటు చేసుకునే ప్రమాదముంది.

నివారణ..

తాజా కూరగాయలు,పౌష్టికాహారంతో వ్యాధిని దూరం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. పాలకూర, క్యారెట్, ముల్లంగి, బీట్‌రూట్, టమాటాలు, అరటి పండ్లు, యాపిల్, ద్రాక్ష, అప్రికాట్‌లో ఐరన్ అధికంగా లభిస్తుంది. అరటిలో ఉండే ఫోలిక్ యాసిడ్ ఈ12 రక్తహీనత నివారణకు ఎంతగానో ఉపయోగపడతాయి.

రక్తహీనత ఉన్న వారిని గుర్తిస్తున్నాం

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, చిన్నారులను గుర్తిస్తున్నాం. వారికి వైద్యపరంగా సలహాలు, సూచనలు తెలియజేస్తున్నాం. ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. ప్రతిరోజూ తప్పనిసరిగా ఒక మాత్ర వేసుకోవాలని సూచిస్తున్నాం. వ్యాధిగ్రస్తులు ఆరోగ్య సూత్రాలు పాటించి జబ్బును తరిమికొట్టేందుకు సహకరించాలి.

– సత్యవతి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: మండల పరిధిలోని దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాత సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేశారు.

బస్సు సర్వీసు ఏర్పాటు

హొళగుంద: మండలానికి పత్తికొండ ఆర్టీసీ డిపో నుంచి బస్సు సర్వీసును అధికారులు ఏర్పాటు చేశారు. ఈ బస్సు ఆదివారం నుంచి అందుబాటులోకి వచ్చింది. మండలంలోని ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలకు వచ్చే భక్తుల కోసం ఇంతకుముందు నందికోట్కూరు డిపో బస్సును ఆర్టీసీ అధికారులు నడిపేవారు. ఆ బస్సును గత కొద్ది నెలలుగా రద్దు చేశారు. దీంతో భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఆ బస్సు స్థానంలో ప్రస్తుతం పత్తికొండ డిపో బస్సును నడుపుతున్నారు. ఈ బస్సు పత్తికొండ నుంచి ఆస్పరి, ఆలూరు వయా ఎల్లార్తి మీదుగా హొళగుందకు చేరుకుని తిరుగు ప్రయాణంలో ఆదే మార్గంలో కర్నూలుకు రాకపోకలు సాగిస్తుంది. ఏదేమైన ఎల్లార్తి మార్గంలో బస్సు సదుపాయం తక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడ్తున్న భక్తులకు ఈ బస్సు ఏర్పాటుతో కొంత సమస్య తీరినట్లయ్యింది.

ఘనంగా వాసవీమాత జయంతి


ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు,


108 కలశాలను ఊరేగింపుగా తెస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : స్థానిక శ్రీ నగరేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వాసవీమాత జయంతి వేడుకలను ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజామున 108 కలశాలతో పాలాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారికి బంగారు తోరణం, ఆభరణాలతో అలంకరించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన చేశారు. అలాగే పురవీధుల్లో 108 కలశాలతో పాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అభిషేకం చేశారు.అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని ఊరేగించారు.సంఘం అధ్యక్షుడు ప్రకాష్, కార్యదర్శి వేణుగోపాల్, ట్రెజరర్‌లు సుబ్రహ్మణ్యం, టి.జి.రాంప్రసాద్, మహిళా మండలి సంఘం అధ్యక్షురాలు సరస్వతి, కార్యదర్శి త్రివేణి, ట్రెజరర్స్ పుష్పలత పాల్గొన్నారు.

కౌతాళం: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఉదయం గంగాజలాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని వెండి తొడుగుతో అలంకరించారు.ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు.


బంగారం కవచం అలంకరణలో వాసవీమాత


పూజలందుకుంటున్న వాసవీ మాత

'బీజేపీని సాగనంపుదాం'

ఆదోని రూరల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం.. దేశాన్ని కాపాడుకుందామని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ వద్ద చేపట్టిన ప్రజా ప్రదర్శనలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు జరపకపోగా ప్రజలపై నిత్యం భారాలు వేయడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, ఎరువులు, పురుగు మందుల ధరలు, జీఎస్టీ పేరుతో ప్రజలపై భారం మోపుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా సమితి కార్యదర్శివర్గ సభ్యులు అజయ్‌బాబు, లక్ష్మిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాధాకృష్ణ, వెంకటేశులు, నారాయణ సుదర్శన్, లక్ష్మన్న, బసాపురం గోపాల్, లింగన్న పాల్గొన్నారు.


ప్రజా ప్రదర్శనలో నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలోని పరిమళ పెట్రోల్ బంక్ వద్ద కుప్పగల్ గ్రామానికి చెందిన బోయ వీరేష్ కర్ణాటక రాష్ట్రానికి సంబంధించిన మద్యాన్ని రాయచూర్ జిల్లాలో కొనుగోలు చేసి సొంత గ్రామానికి తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని 44 కర్ణాటక మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు మాధవరం పోలీసులు తెలిపారు.

కౌతాళం: మండలంలోని ఉరుకుంద గ్రామానికి చెందిన గోవిందు అక్రమ మద్యం తరలిస్తుండగా ఆదివారం తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన గోవిందును అదులోకి తీసుకొని కర్ణాటక మద్యం 90ఎంఎల్ పరిమాణం కలిగిన 192 ఒరిజినల్ ఛాయిస్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గోవిందును అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు వివరించారు.


స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న ఎస్ఐ

ఆదోని రూరల్ : మండలంలోని జి.హొసళ్లి గ్రామానికి చెందిన చిన్న రామాంజనేయులు అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని అమ్ముతుండగా అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పెద్దతుంబళం ఎస్ఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. రామాంజనేయులు వద్ద నుంచి 90ఎం.ఎల్. పరిణామం గల 40 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఒక్కటైన జంటలు

ఆలూరు: భగవంతుడి దీవెన, చల్లని చూపు ఉంటే ప్రతి ఫలం తప్పక లభిస్తుందని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. హాలహర్వి మండలం బల్లూరు గ్రామంలో బల్లూరయ్య స్వామి దేవాలయంలో ఆదివారం శివయ్య స్వామి వడియార్, కరిలింగప్ప ఆధర్యంలో వివిధ గ్రామాలకు చెందిన 104 జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. వేద పండితుల ఆశీస్సులతో వరులు వధువుల మెడలో మూడు ముళ్లు వేశారు. మంత్రి గుమ్మనూరు జయరాం నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం మంత్రిని కురుబ కులస్తులు పూలమాలలతో సత్కరించారు. కురుబ కులస్తులు, గొరవయ్యలు బీరప్ప డోలు వాయించి సంబరాలు నిర్వహించారు. ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, బల్లూరు సర్పంచ్ మారెన్న, ఎంపీటీసీ సభ్యుడు గాదిలింగప్ప, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, నాయకులు లింగప్ప, నెట్టికంఠమ్మ, భీమప్ప తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గూళ్యం గ్రామంలో గాదిలింగప్ప తాత ఆలయాన్ని మంత్రి జయరాం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దహ్యాటలో సామూహిక వివాహాలు

హొళగుంద: మండల పరిధిలోని పెద్దహ్యాట గ్రామంలోని విరుపాక్ష స్వామి దేవాలయం ఆవరణలో ఆదివారం సామూహిక వివాహాల కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామానికి చెంది కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో నివాసం ఉంటున్న ఆనందగౌడ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 9 నిరుపేద జంటలు వివాహబంధంతో ఒక్కటయ్యాయి.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన

ఆదోని అర్బన్ : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో షా ప్రేమ్‌చంద్ మానాజీ చారిటబుల్ ట్రస్ట్ మెడికల్ అసోసియేషన్ వారి సహకారంతో మండలంలోని బసరకోడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి వైద్య నిపుణులు డాక్టర్ రాఘవేంద్రరావు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో దాదాపు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో 30 మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు సూచించారు. పరీక్షల కోసం వచ్చిన వారికి భోజన వసతి కల్పించారు. రోటరీ క్లబ్ సభ్యులు భరత్‌షా, హితేష దీపక్, ఉమేష్, సాబీర్‌అహ్మద్, హుసేన్‌బాషా, షణ్ముఖ, పద్మనాభయ్య, నితిన్, షా శాంతిలాల్ పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నపూర్ణ భోజన శాల అన్నదానం పథకానికి రూ.1,01,116 విరాళం వచ్చినట్లు మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌కు చెందిన సత్య వెంకట అప్పారావు ఈ మొత్తాన్ని అందజేశారని చెప్పారు.

నేటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు

కోసిగి: డి.బెళగల్ గ్రామంలో వెలసిన రంగస్వామి ఆలయంలో నేటి నుంచి ధ్వజ స్తంభం ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు మూర్తిస్వామి, గ్రామ పెద్దలు రాము, పద్మ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ సోమవారం నుంచి ప్రారంభించే పూజలు మూడు రోజుల పాటు కొనసాగుతాయన్నారు. ఈనెల 3న బుధవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, కలశస్థాపన హోమాలు, ప్రత్యేక పూజలు ఉంటాయని చెప్పారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఆలూరు: దేవనకొండ మండలం తెర్నెకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఏబీఎం చర్చి ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్ఆర్ఐ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకుల్లో ఉత్సాహం నింపేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. క్రీడలు స్నేహ పూర్వకంగా ఉండాలన్నారు. క్రాంతికుమార్, ఏబీఎం చర్చి పాస్టర్ సాధక్ మోరిస్, గ్రామ సర్పంచ్ అరుణకుమార్ తదితరులు ఉన్నారు.

స్పోర్ట్స్

సాఫ్ట్‌బాల్ జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక ఏ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం జూనియర్ సాఫ్ట్‌బాల్ బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను అలంపూర్ జెడ్పీటీసీ ఇస్మాయిల్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 26 నుంచి 28 వరకు కడప జిల్లాలో నిర్వహించనున్న 10 వ రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్

ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడలు నేర్చుకోవడం ఎంతో అవసరమని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక పెద్ద మార్కెట్ కేఎంసీ పార్కులో వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తుది దశకు వంతెన పనులు


పూర్తయిన నాగలదిన్నె వంతెన


వేగంగా సాగుతున్న అప్రోచ్ రోడ్డు పనులు


నందవరం: 2009 వరద ధాటికి నందవరం మండలం నాగలదిన్నె బ్రిడ్జి కూలిపోయిన విషయం విధితమే. తెలంగాణ, ఆంధ్ర సరిహద్దులను కలుపుతూ బంధాలకు వారధిగా వంతెన వర్ధిల్లింది. బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం కావడంతో దశాబ్దానికిపైగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడంతో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పట్టుబట్టి వంతెన నిర్మాణం పూర్తికి కృషి చేశారు. ఈ నేపథ్యంలో వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం కంకరతో అప్రోచ్ రోడ్డు పూర్తి చేశారు. బీటీ రోడ్డు పనులు సాగుతున్నాయి. వంతెన పనులు తుది దశకు చేరుకోవడంతో త్వరలోనే రాకపోకలకు సమస్య తీరుతుందని ఇరు ప్రాంతాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అప్రోచ్ రోడ్డు పనులు, బీటీ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేసి నాగలదిన్నె బ్రిడ్జిన్ని త్వరలో ప్రారంభిస్తామని ఆర్ అండ్ బీ అధికారులు చెబుతున్నారు.

హొళగుందలో 13.2 మి.మీ వర్షం

హొళగుంద: మండలంలో ఆదివారం తెల్లవారుజామున ఓ మోస్తరు వర్షం కురిసింది. చిన్నగా చినుకులతో మొదలైన వర్షం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తారుగా కురిసింది. ఈ వర్షంతో పుడిమి తల్లి కొద్ది వరకు చల్లబడి ప్రజలకు కొద్దిగా ఉపశమనం కలిగింది. గత కొన్ని రోజుల నుంచి ఎండ విపరీతంగా ఉండి ఉక్కపోతతో ప్రజలు అల్లాడి పోతున్నారు. మధ్యాహ్నం వీధుల్లో జనాలు కన్పించని స్థితికి వచ్చింది. రెండు రోజులుగా సాయంత్రం మేఘాలు కమ్ముకుంటున్నా వర్షం దోబూచులాడుతూ ఎట్టకేలకు ఆదివారం కురిసింది. ఈ వర్షం వల్ల మామిడి తోటలకు కొద్దిగా నష్టం వాటిల్లింది. మండలంలో ఆదివారం 13.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

శ్రమ జీవుల వేడుక

- జిల్లాలో 4 లక్షల మంది కార్మికులు
- కష్టజీవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- వివిధ పథకాలు అమలు
- నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం


హమాలీ కార్మికుడు

కర్నూలు(రాజ్‌విహార్): శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేదని శ్రీశ్రీ అన్నట్టు శ్రమకు మించిన ఆయుధం లేదు. శ్రమ శక్తి లేనిదే ఏ దేశ అభివృద్ధి జరగదు. అందుకే శ్రమను గౌరవించాలి..శ్రామికులను ఆదరించాలంటారు. నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం. కష్టానికి తగిన గుర్తింపు, సరైన వేతనం, రోజుకు 8 గంటల పని హక్కును పోరాడి సాధించుకున్న రోజు(మే 1). సంపద సృష్టికర్తలైన కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది.

జిల్లాలో 1.25లక్షల మంది సంఘటిత, 1.5లక్షల మంది అసంఘటిత, భవన, బీడీ, ఇతర నిర్మాణ రంగ కార్మికులు మరో లక్ష మంది ఉంటారని అంచనా. డ్రైవర్లు 37 వేల మందికి పైగా, దుకాణ, ఇతర సంస్థల్లో పనిచేసే కార్మికులు 29,121 మంది, మిగిలిన కార్మికులు మరో పాతిక వేల మంది ఉంటారని కార్మిక శాఖ లెక్కలు చెబుతున్నాయి. చట్టం ప్రకారం భవన నిర్మాణ కార్మికులకు పని చేయించే చోట కనీస సౌకర్యాలు కల్పించాలి. ముఖ్యంగా మంచినీటి సౌకర్యంతో పాటు నీడ వసతి, టాయ్‌లెట్, బాత్రుం సౌకర్యం కల్పించాలి. అపార్ట్‌మెంట్లు నిర్మించే చోట చుట్టూ నెట్ (వల తరహా తార్పల్ పట్టలు) అమర్చాలి. దీనివల్ల ప్రమాదాలు నివారించవచ్చు. ఎండ తీవ్రంగా ఉన్న రోజుల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 4గంటల మధ్య బహిరంగ ప్రదేశాల్లో పనుల చేయించరాదు. అయితే, ఈ నిబంధనలు అమలులో జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

– కార్మికులకు ప్రభుత్వం అండ

ప్రభుత్వం కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం పలు పథకాలు ప్రవేశపెట్టింది. ముఖ్యంగా ప్రమాద బీమా సౌకర్యంతో పాటు కార్మికులు గుర్తింపు కార్డులు, వారి పిల్లల ఉపకారవేతనాలు వంటి అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నారు. గుర్తింపు కార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద, సహజ మరణ బీమా సౌకర్యం కలిగిస్తోంది. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకుంటే ప్రోత్సాహం కింద రూ.5వేలు, కుమార్తె, మహిళా కార్మికురాలు వివాహానికి రూ.20 వేలు, ఈ–శ్రామ్ గుర్తింపు కార్డులు కలిగిన తాపీ మేస్త్రీలతో పాటు వివిధ నిర్మాణ రంగాల్లో ఉన్న అసంఘటిత కార్మికులకు రూ.2 లక్షల ప్రమాద బీమా, ప్రధానమంత్రి శ్రమ్ యోగి మాన్‌ధన్ (పీఎం–ఎస్‌వైఎం) పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడు దరఖాస్తు చేసుకుంటే నెలకు రూ.15 వేలు పొందే వీలు ఉంటుంది. టైలరింగ్ వృత్తిలో స్థిరపడిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.10 వేలు ఇస్తోంది.

కార్మిక సంక్షేమానికి చర్యలు



జిల్లాలో ఉన్న సంఘటిత, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన వారి చెంతకు చేర్చేందుకు ప్రణాళిక ప్రకారం కృషి చేస్తున్నాం. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు గుర్తింపు కార్డులు కలిగి ఉండడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే పనిచేసే చోట యజమానులు, నిర్వాహకుల నుంచి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.మేడే సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు.

– బాలు నాయక్, జేసీఎల్, కర్నూలు.